# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 08 -01-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం.
- కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈరోజు నుంచి మూడు రోజులపాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ పర్యటన.
- మహిళలు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించిన హెూం మంత్రి వంగలపూడి అనిత .
- మత్స్యకారుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్న మంత్రి కె. అచ్చెన్నాయుడు.
- రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వానికి సూచించిన వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి.

----------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమైంది. అమరావతి రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు -ఎస్ఐపిబి, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ - సిఆర్డిఏ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను చర్చించి మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశముందని అధికారులు తెలిపారు.

-----------------------

గుంటూరు వేదికగా సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్ సొసైటీ- సరస్ మేళా ఈ రోజు నుంచి ప్రారంభమవుతుంది. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ -మెప్మా ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహిస్తోన్న ఈ మేళాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం ప్రారంభిస్తారు. ఈ రోజు నుంచి ఈ నెల 18వ తేదీ వరకు 10 రోజుల పాటు జరిగే ఈ మేళాలో అన్నిరాష్ట్రాల నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులు 300 స్టాళ్లు ఏర్పాటు చేశారు.

-----------------------

కాకినాడ జిల్లా పిఠాపురంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ ఈ రోజు నుంచి మూడు రోజులపాటు పర్యటించనున్నారు ఈ రోజు రాత్రికి పిఠాపురం చేరుకోనున్న పవన్ కళ్యాణ్ రేపు ఉదయం "పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం" పేరిట నిర్వహించనున్న ముందస్తు సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. స్థానిక కళాశాల మైదానంలో సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తారని అనంతరం నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు. సాయంత్రం పిఠాపురం

పురపాలక సంఘం పరిధిలో ఇటీవల ముంపునకు గురైన ఇందిరానగర్ కాలనీ, రైల్వే స్టేషన్ సమీపంలోని మోహన్ నగర్ లను సందర్శిస్తారని అధికారులు తెలిపారు.

-----------------------

మహిళలు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని హోం మంత్రి వంగలపూడి అనిత ఆకాంక్షించారు. విజయవాడలో నిర్వహించిన "మహిళా ఫెస్ట్" కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. స్త్రీలు అన్ని రంగాల్లోనూ గొప్ప ప్రగతి సాధిస్తున్నారని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్...30 సెకన్లు

-----------------------

యువతకు క్రీడల్లో ప్రోత్సాహం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి తెలిపారు. రాయచోటిలో ఆధునిక క్రీడా మైదానం ఏర్పాటు ప్రణాళికలపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈ రోజు సమీక్షించారు. అనంతరం రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, 7.5 కోట్ల రూపాయల వ్యయంతో మూడు ఎకరాల విస్తీర్ణంలో క్రీడా మైదానం నిరి ంచనున్నామని చెప్పారు. ఒకేసారి 100 మంది క్రీడాకారులు శిక్షణ పొందే విధంగా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించేలా ఈ స్టేడియాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. రాయచోటితో పాటు పరిసర ప్రాంతాల యువతకు క్రీడల్లో ప్రోత్సాహం అందించేందుకు ఈ నిర్మాణం ఉపయోగపడుతుందని మంత్రి వివరించారు.

-----------------------

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ -వీబీ జీ రామ్ జీ పథకం ఉపయోగపడుతుందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందరేశ్వరి అన్నారు. వీబీ జీ రామ్ జీ పథకంపై రాజమహేంద్రవరంలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ,

వాయిస్...25 సెకన్లు

-----------------------

దేశానికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధిలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న Pro-Active Governance and Timely Implementation- ప్రగతి సమావేశాలు దోహదపడ్డాయి. ఇందులో భాగంగా మహారాష్ట్రలోని సోలాపూర్ సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ప్రగతి సమావేశం ఎలా దోహదపడిందో ఈ రోజు తెలుసుకుందాం.

మహారాష్ట్రలోని సోలాపూర్ సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం, ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు ఆ రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఒక కీలక ప్రాజెక్ట్‌గా అవతరించింది. ఈ ప్రాజెక్టును సుమారు 11 వేల 406 కోట్ల రూపాయల వ్యయంతో, మొత్తం వెయ్యి 320 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో అభివృద్ధి చేశారు.
2015 డిసెంబర్ 30న జరిగిన ప్రగతి సమీక్ష సమయంలో దీని నిర్మాణ పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఈ ప్రాజెక్టు పునరావాస సమస్యను ఫిబ్రవరి 2016 నాటికి పరిష్కరించాలని, ప్రాజెక్టులోని రెండు యూనిట్లను

జనవరి 2017 నాటికి పూర్తి చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. దీంతో థర్మల్ విద్యుత్ కేంద్రం సకాలంలో పూర్తై 2019లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయడంలో ప్రగతి యంత్రాంగానికి సోలాపూర్ సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం ఒక బలమైన ఉదాహరణగా నిలిచింది.

----------------------

మత్స్యకారుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, సంక్షేమ కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు.రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్‌కు నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ కమిటీ సభ్యులు విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రిని నిన్న కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి మత్స్యకారుడికి చేరేలా కృషి చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సహకార సంఘాల ద్వారా పరిష్కారం చూపాలని తెలిపారు.

----------------------

రాయలసీమ ప్రాంతానికి నీరు అందించే రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ కు ప్రాధాన్యత ఇవ్వాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఈరోజు

పాత్రికేయులతో మాట్లాడుతూ, కృష్ణా జలాలు సముద్రంలో వృధాగా పోకుండా రాయలసీమకు సాగునీటిని అందిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ రాయలసీమ ప్రాంతానికి సంజీవని వంటిదని పేర్కొంటూ,

వాయిస్ .. 27 సెకన్లు

-----------------------

అనంతపురం జిల్లాలో పాల ఉత్పత్తిని పెంచేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా పశు సంవర్తక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్ చంద్ తెలిపారు. అనంతపురంలోని ఆకుతోట పల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాల దిగుబడిని ప్రోత్సహించేందుకు నిర్వహించిన "అనంత పాలధార" కార్యక్రమంను ఆయన ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రేమ్ చంద్ మాట్లాడుతూ, పశు పోషకులను ప్రోత్సహించేందుకు "అనంత పాలధార " పేరుతో జిల్లాస్థాయి పాల దిగుబడి పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే శాస్త్రీయ పద్ధతుల్లో పాడి పెంపకం, మెరుగైన పశుజాతులు, సమతుల్య పోషణ, కృత్రిమ గర్భధారణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

-----------------------

తీర ప్రాంతాల్లో మడ అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రధాన అటవీ సంరక్షణ అధికారి పి.వి. చలపతీ రావు తెలిపారు. విజయవాడలో "తీరప్రాంత ఆవాసాలు, ఆదాయం కోసం మడ అడవుల కార్యక్రమం" -MISHTI అంశంపై విజయవాడలో నిర్వహించిన కార్యశాలలో ఈ రోజు ఆయన పాల్గొని మాట్లాడుతూ, తుపాన్‌తో పాటు తీర ప్రాంతాల్లో కోతలు వంటి వాటి నుంచి ప్రజలను, భూభాగాన్ని రక్షించడంలో మడ అడవులు కీలకపాత్ర

పోషిస్తాయని చెప్పారు. జీవవైవిధ్యానికి ప్రతీకగా నిలిచే మడఅడవుల పరిరక్షణతో పాటు విస్తరణ తప్పనిసరి అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =